# 35. విముక్తి

ప్రియంవద ఉత్తరం పట్టుకొని వణికిపోతున్నది.

ఆమె అత్తగారు, తొందరపనిమీద బజారుకు పోతూ, కోడలు బట్టలు ఉతుకుతూ ఉండడంచేత, వీధివైపున్న గ్రిల్‌కు తాళం వేసుకు వెళ్లిపోయింది.

అత్తగారు వెళ్లిన అరగంటకు పోస్టుమాన్ వచ్చి కాలింగ్‌బెల్ మోగించాడు.

అప్పటికి కూడా బట్టలుదకడం పూర్తి కాలేదు. ప్రియంవద చేతులు కడుక్కొని వీధి వరండాలోకి వచ్చింది.

"అమ్మగారు లేరా?" పోస్టుమాన్ అడిగాడు.

"లేరు. బజారుకి వెళ్లారు." అంది ప్రియంవద.

"మూడు రోజులై ఆమె ఈ వుత్తరం కోసం ఎదురు చూస్తున్నారు. ఎక్కడో పడేయకుండా ఆమెకివ్వడం మరచిపోకండి!"

"అలాగే!"

అంతర్దేశీయ పత్రపు అంచులను, వ్రాసిన పెద్దమనిషి సరిగా అంటించలేదు. స్పష్టాస్పష్టంగా స్టాంపు మీద 'భీమవరం' అన్న ముద్ర కనిపిస్తోంది.

ఒకళ్లకు వచ్చిన ఉత్తరాన్ని చదవడం సభ్యత కాదు.

ప్రియంవదకు ఈ విషయం తెలిసినా, మూడురోజులై అత్తగారు ఎదురుచూస్తున్న ఉత్తరాన్ని, సరిగా అంచులు అంటించని దానిని, చదవకుండా ఉండలేకపోయింది.

ఆ ఉత్తరంలో ఒక్కొక్క వాక్యం చదువుతుంటే, ఆమె ముఖం భయంతో వివర్ణం కావడం మొదలు పెట్టింది. ఉత్తరం పూర్తిగా చదివిన తరువాత, తన కాళ్లకింద నున్న నేల కిందికి దిగిపోతున్నట్లనిపించింది. ఆమెకు ఇల్లు విడిచి పరుగెత్తి వీధిలోకి పోవాలనిపించింది.

ఏ పని చేయలేక, తన నిస్సహాయతకు విస్తుపోయింది.

ఆ క్షణంలో అత్తగారు వచ్చి అంచులు విడిన ఉత్తరాన్ని తన చేతిలో చూస్తే యింట్లో పెద్ద యుద్ధం జరుగుతుంది. ఆరునెలల వరకు ఈ తప్పుపని యొక్క ఫలితాలు తన్ను తింటూనే ఉంటాయి.

ఏంచేయడం?

ఉత్తరాన్ని చింపిపారేస్తే!

సాక్ష్యం నాశనం కాదే!

పోస్టుమాన్- రేపు ఆదివారం - ఎల్లుండి సోమవారంనాడు తప్పకుండా అత్తగారితో చెప్తాడు.

అంతకన్న అవివేకమైన పని వేరొకటిలేదు.

ఈ ఉత్తరం తనను భక్షించవలసింది. దీనినే తన రక్షణకోసం వినియోగించుకోవాలి.

తననెవరు రక్షిస్తారు?

నిమిషనిమిషానికి ఆమెలో తీవ్రమైన ఆందోళన విజృంభించింది.

ఆ అపార్ట్‌మెంట్సులో ప్రియంవదగారిది రెండవ అంతస్తులో నున్న ప్లాటు. వీధివేపు ఆవరణ, గోడ దాని వెనుకనున్న రోడ్డు గ్రిల్‌లోంచి చూస్తే స్పష్టంగా కనిపిస్తాయి.

ఉన్నట్టుండి రోడ్డుమీద నడుస్తున్న పద్మ, ప్రియంవద దృష్టిలో పడింది.

"ఓపద్మా! ఓపద్మా!!" ప్రియంవద చాల గట్టిగా అరిచింది. ఆ అమ్మాయి తలెత్తి చూసింది.

ప్రియంవద గొంతు బిగుసుకుపోయింది. చేతులతో మీదకు రమ్మని సంజ్ఞ చేసింది, పద్మకు.

పద్మ పరుగులు తీసి మేడమెట్లెక్కి వచ్చింది.

గ్రిల్ సందులలోంచి ఉత్తరాన్ని పద్మముందు పడేసింది.

"పద్మా! ఈ ఉత్తరం పట్టుకొని పారిపో! పరుగెత్తు. నన్ను ఎలా రక్షించగలవో! పారిపో'

ప్రియంవద చేతులు జోడించింది.

పద్మ ఉత్తరం పట్టుకొని, తొందరగా మెట్లుదిగి, రోడ్డు మీద పరుగులు తీసింది.

నిలువున కూలబడిన ప్రియంవద పదినిమిషాలలో ప్రజలలో పడింది. నిలబడింది. బాతరూమ్ వేపు నడిచింది. బట్టలు మామూలుగా ఉతకడం మొదలుపెట్టింది.

మరొక అరగంటలో గ్రిల్‌కి వేసిన తాళం తీసిన చప్పుడు, చిన్న పిల్ల లావణ్యా నవ్వులు వినిపించాయి.

లోపలికి అడుగు పెడుతూనే అత్తగారు ప్రశ్నించింది.

"పోస్టుమాను ఉత్తరమేదేనా యిచ్చాడా?"

"లేదు." ముక్తసరిగా కోడలు జవాబు చెప్పింది.

వెళ్లి పోతూ పద్మ రెండే మాటలు చెప్పింది.

"ప్రియంవదా! ఏమీ జరగనట్లు నువ్వు వ్యవహారించాలి. ధైర్యమే మన ఆయుధం"

మనుమరాలికి మామ్మగారు అన్నంపెట్టారు.

ప్రియంవద స్నానంచేసి, బట్టలు వేసుకోని వచ్చేసరికి పన్నెండయింది. మామగారికి, భర్తకి ఆమె కారియర్లు సర్దింది. ఒంటిగంటకు కుర్రాడికి కారియర్లు అందజేసిన తరువాత అత్తగారు, కోడలు భోజనం చేశారు.

ప్రియంవద టేబిలు సర్ది మంచంమీద నడుము వాల్చే సరికి రెండు గంటలయింది.

పక్క గదిలో అత్తగారు, కూతురు పడుక్కున్నారు.

ఉత్తరం గురించి ఆలోచిస్తుంటే ఆమెకు కళ్లంట నీరు ధారగా కారడం మొదటు పెట్టింది. ఏడ్చినందువల్ల ప్రయోజనం లేదు. ఆ విషయం మరచిపోడానికి సగం వరకు చదివిన ఇంగ్లీషు నవల తీసింది: కాని, ప్రయోజనం లేకపోయింది.

పద్మ కళ్లబడకపోతే ఏమయి ఉండేది.?

స్నేహితురాలు చెప్పిన ఆఖరి వాక్యం మనసును ఊరటపరిచింది.

"ధైర్యమే మన ఆయుధం!"

పడకగది సరిగా సర్దింది. మంచంమీద పరచిన దుప్పటీ మార్చింది. కర్టెను గుడ్డలు దులిపింది. ఎన్ని చిన్న చిన్న పనులు చేసినా కాలం చాల మెల్లగా నడిచింది.

అత్తగారు సరిగ్గా నాలుగు గంటలకు లేస్తారు. ఆమెకు కాఫీ, లావణ్యకు హార్లిక్సు సిద్ధం చేయాలి.

మామగారు అయిదున్నరకు వస్తాడు- భర్త అయిదున్నరకు వస్తాడు. వాళ్లకు తేలికపాటి టిఫిన్, కాఫీ తయారు చేయాలి.

తరువాత రాత్రి వంటకు ఆయత్తమవాలి.

పద్మ ఏం చేస్తుంది.

ఆమె ఏమీ చెయ్యకపోతే, నిత్యకృత్యాలు యథాప్రకారం ప్రియంవద చెయ్యక తప్పదు.

ఉత్తరం గురించి ఏపాటి ఆలోచించినా, ఆమె ధైర్యం తునాతునకలైపోతున్నది.

సరిగ్గా నాలుగయింది. అత్తగారు లేచింది. చిన్న పిల్ల లావణ్య లేవలేదు.

కాలింగ్ బెల్ మోగింది.

ప్రియంవద, వంటింట్లో కాఫీ చేస్తుండడంచేత, అత్తగారే వెళ్లి వీధి తలుపు తీశారు.

ప్రియంవదతో చదువుకున్న పద్మ, శర్మ వచ్చారు. వాళ్లు అత్తగారికి నమస్కారాలు చేసి, ముందు గదిలోకి ఆమె వెంటనే వచ్చారు.

"మేము మీతో మాట్లాడడానికి వచ్చాము. ఇవాళ మా కాలేజీ పాత విద్యార్థులు సమావేశమయి పండుగ జరుపుకుంటున్నారు. నాలుగున్నరనుండి ప్రోగ్రాములు మొదలవుతాయి. రాత్రి తొమ్మిది గంటలకు డిన్నరు. మిమ్మల్ని ఒక విషయం అడగడానికి వచ్చాము. ఈ ఒక్కసాయం, మీరు ఇంటి పనులు చేసుకోడానికి ఇబ్బందులు పడాలి. మిమ్మల్ని మరిమరి రిక్వెస్టు చేస్తున్నాము. దయచేసి మీరు ప్రియంవదను, లావణ్యను పంపించాలి."

అత్తగారు ఆలోచించారు.

"నేనెవరిని పంపడానికి! మా అబ్బాయి రావాలి- వాడినడిగి, వాడు ఒప్పుకుంటే పంపిస్తాను."

"మాడమ్! మీరు చాల మంచివాళ్లు! మీరు మహిళాసమాజంలో యిచ్చిన ఉపన్యాసాలు పేపర్లో చదివి మేము ఆశ్చర్యపోతుంటాము. మీ మాటకు మీ అబ్బాయి కాదనరు. ప్లీజ్! ప్లీజ్!!"

ఇద్దరూ ఆమె పాదాల మీద పడినంత చేశారు.

"మరొక్క అరగంటలో మా అబ్బాయి వస్తాడు. అంతవరకు కూర్చొండి."

"లేదు మాడమ్! మీరు మంచి వాళ్లని మాకు తెలుసు. అందుకే ఆటో వీధిలో ఉంచి వచ్చాము. మీ సహకారం కోరుతున్నాము."

ప్రియంవద, ఆమె కూతురు యింటినుండి బయటపడేసరికి మరొక పావుగంటయింది.

ఆమె యిల్లు విడవడమే ప్రధానం- ఆపని సాధించడం విజయసాధనకు మొదటిమెట్టు.

కాలేజీ ఆవరణలో సరిగ్గా నాలుగున్నరకు ప్రోగ్రాము మొదలయింది. చాలమంది స్నేహితులను చూడడంతో ప్రియంవదకు ధైర్యం వచ్చింది

పెండాలులో చీకటిపడేవరకు కూతురిని ఒడిలో పెట్టుకొని ఆమె కూర్చుంది. స్టేజిమీద జరుగుతున్నవి ఆమెకు కనిపించడంలేదు. ఏవో ఘోరమైన ఆకారాలు - వాటిని చూస్తుంటే ఆమెకు మతిపోతున్నది.

రాత్రి ఏడు గంటలయింది.

పద్మ, అందరి మధ్య కూర్చున్న ప్రియంవద దగ్గిరకి వచ్చింది

"మీ ఆయన నీకోసం వస్తాడేమోనని ఇంతవరకు ఎదురు చూశాం. కాని, ఆయన రాలేదు. మేమూ అదే కోరాము. ప్రిన్సిపాలు గారి గది తాళాలు తీసుకున్నాము. అక్కడ కూర్చొని ఏమి చెయ్యాలో ఆలోచించాలి. పద"

ప్రిన్సిపాలు గారి గదిలో ప్రియంవదతో పాటు నలుగురు కూర్చున్నారు. పద్మ, శర్మ, కాకుండా రామమూర్తి, విశ్వనాథం కూడా అక్కడున్నారు. వాళ్లు కూడా లెక్చరర్లే.

"మేము నలుగురం మీ అత్తగారికి వచ్చిన ఉత్తరం చదివాము

"మధ్యాహ్నమంతా దాని గురించే చర్చించాము. చివరకు మూడు దారులు సమస్యను పరిష్కరించడానికి నిశ్చయించాము.

"మొదటిది- ఈ ఉత్తరం పోలీసు అధికారులకు చూపించి వారి సమక్షంలో మీ అత్తవారు, కన్నవారు సమావేశం కాగా, వారిచేత అందరికీ చీవాట్లు పెట్టించి, మీ అత్తవారు ఇక మీద ఎటువంటి హాని నీకు కలిగించమని వ్రాతపూర్వకంగా యిచ్చిన తరువాత నువ్వు తిరిగి కాపురం చేయడం.

"రెండవది- నీకు ఇంత హాని తలపెట్టిన అత్తవారింట నువ్వు ఉండడం కష్టం. కాబట్టి పుట్టింటే శేష జీవితం గడపడం.

"మూడవది- అటు పుట్టింట, ఇటు అత్తింటకాకుండా నువ్వు స్వతంత్రంగా జీవించడం.

"ఈ మూడు సలహాలలోను. నీ కూతురు లావణ్య గురించి ఆలోచించలేదు. పిల్లకు మైనారిటీ తీరేవరకు నీతో ఉండడానికి కోర్టు కూడా అనుమతిస్తుంది. కాబట్టి మరే ఇబ్బంది ఉండదు."

ప్రయంవద వాళ్ల నలుగురి ముఖాలలోకి చూసింది. తరువాత మెల్లగా అంది.

"నాకొక వారం రోజులు వ్యవధి యివ్వండి. మీరు సూచించిన ఏదారి మంచిదో ఆలోచిస్తాను. అంతవరకూ మా లావణ్యతో మా పుట్టింట ఉంటాను."

"ఇది చాలా బాగుంది. ఈలోగా మేముచేయవలసిన పనొకటుంది. ఆపని ముగిసే వరకు ఈ ఉత్తరం గురంచి ఎవరికి తెలియనీయవద్దు. రాత్రి డిన్నరయిన తరువాత, మీపుట్టింటికి దిగబెడతాము. మీ వాళ్లకు కూడా ఉత్తరం సంగతి తెలియనీయవద్దు.

"మంచిది"

రాత్రి పదకుండు గంటలకు ప్రియంవద, లావణ్య, ఇద్దరూ సీతారామయ్య గారిల్లు చేరుకున్నారు. పాత విద్యార్థుల వార్షిక సమావేశానికి ప్రియంవద వచ్చిందని, చాల తలనొప్పిగా ఉంటే తీసుకొచ్చామని పద్మ చెప్పింది. రెండు మూడు రోజులు విశ్రాంతి తీసుకుని, అత్తవారింటికి వెళ్తుందని ఆమె చెప్పింది.

ప్రియంవద చాల రాత్రి వరకూ ఆలోచిస్తూనే ఉంది.

తన భర్తకు వ్యక్తిత్వం లేదని ఆమెకు తెలుసు. చాల మంది కుటుంబాలలో ఇటువంటి సుపుత్రులే ఉన్నారు. ఏదో ఒకరోజు ఈ బుద్ధిమంతుడు తల్లి చేతి గోరుముద్దలు మానేసి, స్వతంత్రంగా తన చేతులతో తినగలడని ఇంతకాలం ఎదురు చూసింది.

అత్తవారింట్లో, తన అభిప్రాయాలు, తన అలవాట్లు మార్చుకోవలసి వస్తుందని ఆమెకు తెలుసు. చాలవరకు పరిస్థితులతో రాజీపడి, గాడిలో పడ్డ బండివలె, పనులు చేసుకుంటూ పోతున్నది.

తన భర్త నలుగురి మధ్య, తల్లి మాటను పాటించినా, ఏకాంతంగా తనతో గడిపిన

కాలంలో  కూడా , తనపై అనురాగం లేకుండా గడుపుతున్నాడని, ఆ తల్లి అంత గొప్ప నటకుడిని తయారు చేసిందని ఆమెకు ఇప్పుడు తెలిసింది.

సాధారణంగా అతని అభిప్రాయాలు, తనవి భిన్నధృవాలని కాపురానికి వచ్చిన కొద్దికాలంలోనే ఆమెకు తెలిసింది. కాళిదాసు మంచి కవి అని ఆమె అంటే, కాదని అతను వాదించే వాడు. ఆ వాదన తర్కానికి నిలవదు.

అటువంటి భర్తతో అయిదు సంవత్సరాలు , ఎంత ఒళ్లు చంపుకొని, మనసుని రాయిచేసుకొని, ఎలా గడిపానని ఆమె ఆశ్చర్యపోయింది.

ప్రియంవద మరునాడు ఉదయం కొంచెం ఆలస్యంగా లేచింది. ఆవేళ ఆదివారమేమో అందరూ యింట్లోనే ఉన్నారు. సరిగ్గా పదకుండు గంటకు అత్తగారు ఫోను చేసింది. ప్రియంవద తల్లి మాట్లాడింది. ప్రియంవద వంట్లో బాగులేదని, రెండు మూడు రోజులుండి వచ్చేస్తుందని ఆమె చెప్పింది.

పగటిపూట లావణ్యాను మేనమామలు ఎత్తుకొని తిప్పారు. నాన్నను, మామ్మను మరిపించారు.

రాత్రివేళ, అందరూ నిద్రపోతుంటే, ప్రియంవదకు ఆలోచించడానికి అనుకూలించింది.

మరునాడు సోమవారం- పోస్టుమాను కొంచెం ఆలస్యంగా వస్తాడు. అత్తగారికి రహస్యం తెలుస్తుంది. అప్పుడు అగ్నిపర్వతాలు ప్రేలుతాయి. దిక్కులు కాలిపోతాయి. సముద్రాలు యింకిపోతాయి.

అప్పుడు తనేం చేయాలి?

ఆ వుత్తరం, ఆమెకు అక్షరం అక్షరం ఆమె కళ్లకు కట్టినట్లే ఉంది.

“శ్రీమతి రామాయమ్మగారికి,

నమస్కారములు- మీరు దయతో వ్రాసిన ఉత్తరము చదువుకున్నాము. మీ అబ్బాయి జాతకంలో అతను పెళ్లాడిన మొదటి భార్య చనిపోతుందని, రెండవసారి పెళ్లాడిన భార్య మిగిలిన జీవితం అతనితో గడపడమే  కాకుండా, సంపదలు తెస్తుందని మీరు వ్రాశారు. ఎంతటికీ మీ అబ్బాయి మొదటి భార్య చనిపోకపోతే మీ మనస్సు బాధపడడం సహజమే కదా! రెండవ బార్య మీ తమ్ముడి గారి అమ్మాయి కాగలదని, అందుచేతనే ఆమెకు వివాహం చేయకుండా అట్టి పెట్టారని మీరు వ్రాశారు. ఎంతకాలం ఆ అమ్మాయి పెళ్లి కాకుండా ఉండగలదు?

మీరు ఈ సమస్యలకు పరిష్కారం చూపించమన్నారు.

ఇంతకు పూర్వము మేము వ్రాసిన ఉత్తరంలో, ఆమె సహజంగా మరణించినట్లు

చేయగల మందు పంపిస్తామన్నాము. మీరు దయగలవారు. అందుకు మీరు సమ్మతించలేదు. కాబట్టి మరో మార్గం కనుక్కోమన్నారు. ఆమెకు మతిపోగొడితే తల్లిదండ్రులు తీసుకుపోతారు. మీకోరక నెరవేరుతుంది. మీరు దీనికి అంగీకరించిన పక్షంలో జవాబు వ్రాయండి. పక్షం దినాలు వాడవలసిన మందు వెల మూడు వందల రూపాయలు. మీరు మా పాతఖాతాదారులు కాబట్టి దీనిని రెండు వందల రూపాయలకే మీకు పంపగలము. వెంటనే డబ్బు పంపవలసింది.'

ప్రియంవద మెదడు మొద్దు బారిపోయింది.

ఏమందూ వాళ్లు పెట్టకముందే మతిపోయినట్లయింది.

ఏదో నిర్ణయం తీసుకోవాలి.

విశ్వనాథం సూచించిన మూడు దారులలోను మొదటిది ఆచరించదగినది కాదు.

రెండవ మార్గం గురించి ఆలోచించాలి.

మరునాడు సోమవారం రానేవచ్చింది. మధ్యాహ్నం పన్నెండు గంటల తరువాత అత్తగారు టెలిఫోనులో మాట్లాడారు. వెంటనే కోడలిని పంపకపోతే రసాభాస జరుగుతుందన్నారు.

ప్రియంవద తల్లితో మెల్లగా చెప్పింది.

"నా మనసు బాగులేదు. ఇక్కడో వారం రోజులుంటాను. మీకేం అభ్యంతరం లేదు కదా!"

"అదేమిటే తల్లీ అలా అంటున్నావు? ఇంతకీ ఆవిడతో ఏం గొడవ వచ్చింది".

తల్లి ప్రశ్నకు ప్రియంవద జవాబు చెప్పలేదు.

మరునాడు సాయంకాలం ఇద్దరు పెద్ద మనుషులు సీతారామయ్య దగ్గిరకు వచ్చారు. ప్రియంవద ఏదో మీటింగుకి వెళ్తానని చెప్పి వచ్చేసిందని, తొందరలో ఆమెను అత్తవారింటికి దిగబెట్టకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వాళ్లు హెచ్చరించి వెళ్లారు.

సీతారామయ్య భార్యను సంగతడిగాడు.

ఆవిడ ఏం చెప్తుంది?

ఉన్న ఒక్క పిల్లకు ఎమ్మెస్సీ దాకా చదువు చెప్పించారు. మంచి సంబంధం తీసుకొచ్చారు. లక్షలు ఖర్చు పెట్టి పెళ్లి చేశారు. ఇప్పుడేం చేయడమో వాళ్లకు అర్థం కాలేదు.

మరునాటి మధ్యాహ్నానికి పద్మ వచ్చింది.

మందులు తయారు చేసే వైద్యుడి యింటి మీద గత రాత్రి విద్యార్థులు దాడిచేసి, అతనికి పళ్లు విరగ్గొట్టి, అతని మందు సీసాలనన్నిటినీ పిప్పి చేసి, అమాయకుల ప్రాణాలు మరి తీయలేనిస్థితికి తెచ్చినట్లు ఆమె చెప్పింది.

మరునాడు ఆమె తుదినిర్ణయం తెలియజేస్తే ఆప్రకారం సహకరిస్తామంది.

ఆ రాత్రి ప్రియంవద ఒక నిర్ణయానికి వచ్చింది. అటు అత్తవారిల్లు కాని, యిటు పుట్టింటి వారిల్లు కాని తనకు ఆశ్రయం ఇవ్వలేవు.

తాను ఈ వూరి నుంచి వెళ్లి, ఎక్కడో ఉద్యోగం చేసుకొని బతకాలి.

ప్రియంవద గదిలో ఇటూ అటూ పచారు చేసింది.

తన నిర్ణయం మర్నాడు అందరికీ తెలియజేయాలనుకుంది.

ఇంతలో లావణ్య లేచి మంచంమీద కూర్చొని "మమ్మీ! డాడీ!" అంటూ ఏడవడం మొదలు పెట్టింది. తల్లి ఏంత బుజ్జగించినా ఊరుకోదు.

విముక్తి నాకు లేదా అని ప్రియంవద బాధపడింది.

ఏదో కూతురును చూసుకుంటూ, అందరికీ దూరమయినా బతకగలననుకుంది.

కాని, ఆ కూతురే తనకు శత్రువైతే ఏంచేస్తుంది.

ప్రయంవద చాల సేపు తన నిస్సహాయతకు నిందించుకుంది.

మెల్లిగా ఆమె మంచంమీద కూర్చుంది.

ఆమెకు నవ్వు వచ్చింది.

వాళ్లందరికీ తనమీద కసి-

తన పిల్ల మీద లేదు

లావణ్య హాయిగా వాళ్లదగ్గిరే ఉండనీ-

తాను మాత్రం- అందరికీ దూరంగా - తనకాళ్లమీదే నిలబడి బతుకుతుంది.

రచన - మాసపత్రిక

☆